# రైతుల నోట్లో మట్టి కొడుతారా?



నకిరేకల్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్

- కాంగ్రెస్ ఏలుబడిలో ఎరువుల కోసం లైన్‌లో చెప్పులు..
- పోలీసులను నిలబెట్టి విత్తనాలు పంచింది వాస్తవం కాదా?
- మాణిక్‌రావు ఠాక్రే, రేవంత్‌రెడ్డి రైతులకు క్షమాపణ చెప్పాలి
- ఎంపీ బడుగుల లింగయ్య

నకిరేకల్, అక్టోబర్ 27 : 'ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రంలోని 65 లక్షల మంది రైతులకు రైతు బంధు కింద పంటలకు పెట్టుబడి సాయం ఇస్తుంటే.. కాంగ్రెస్ నాయకులు అడ్డుకొని వారి నోట్లో మట్టి కొడుతారా. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చెప్పులు లైన్‌లో పెట్టి ఎరువుల కోసం ఎదురుచూసింది వాస్తవం కాదా? పోలీసులను నిలబెట్టి విత్తనాలు పంచలేదా?' అని రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్ ప్రశ్నించారు. రైతుబంధు ఆపాలని ఈసీకి ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే, పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి రాష్ట్ర రైతాంగానికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నకిరేకల్ పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచీ రైతుల పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తున్నదన్నారు. రైతు బీమా, ఉచిత విద్యుత్, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను కూడా ఆపేయాలనే దుర్మార్గపు ఆలోచన చేస్తున్నదని విమర్శించారు. రాష్ట్ర పభుత్వం 24 గంటల ఉచిత కరెంటు ఇస్తుంటే.. టీపీసీసీ చీఫ్ రేవంతర్‌రెడ్డి 3 గంటలు చాలని మాట్లాడుతుండని, ఎలా సరిపోతుందని అడిగితే.. గంట సేపట్లో ఎకరం పారుతుందని చెప్పడం సిగ్గుచేటని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కరెంటు ఎప్పుడు పోతుందో.. ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి ఉండేదని గుర్తు చేశారు. ఎరువుల బస్తాల కోసం చెప్పులు లైన్‌లో పెట్టి ఎదురు చూసేదని.. గొడవలు, కొట్లాటలు అయితే పోలీస్ స్టేషన్‌లో ఉంచి ఎరువులు పంచింది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. విత్తనాలు దొరుకని పరిస్థితి ఉండేదన్నారు. తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలను ఆపేయాలని కాంగ్రెస్ కుట్ర పన్నుతున్నదని, ఆ కుట్రలను రాష్ట్ర ప్రజలు, రైతాంగం తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఎన్నో ఇబ్బందులు పెట్టిందని, మళ్లీ ఆగం చేయాలని చూస్తే రాబోయే ఎన్నికల్లో రైతులు కాంగ్రెస్‌ను చిత్తుచిత్తుగా ఓడిస్తారని హెచ్చరించారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలు కొత్తవి కావని, పదేండ్లుగా దశల వారీగా అమలు చేస్తున్నామని గుర్తుచేశారు. సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగాలని, ఎవరైనా కొర్రీలు పెట్టాలని చూస్తే రైతులు సహించబోరని హెచ్చరించారు. నిరంతరం ప్రజల సంక్షేమం కోసం కృషిచేస్తున్న బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సమావేశంలో నకిరేకల్ మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ప్రగడపు నవీన్‌రావు, పట్టణ అధ్యక్షుడు యల్లపురెడ్డి సైదిరెడ్డి, నాయకులు కృష్ణమూర్తి, సదానందం, మహమూద్ అలీ, గోపి, పాల్గొన్నారు.



కొండమల్లేపల్లిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్

# రైతు వ్యతిరేక పార్టీ కాంగ్రెస్

- రైతుబంధును అడ్డుకుంటున్న ఆ పార్టీకి బుద్ధి చెప్పాలి
- బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్రకుమార్

కొండమల్లేపల్లి, అక్టోబర్ 27 : సీఎం కేసీఆర్ రైతుల మేలు కోసం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతుబంధును ఆపాలని ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడంతో కాంగ్రెస్ రైతు వ్యతిరేక పార్టీ అని మరోసారి రుజువైందని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. మండంలోని దంజిలాల్‌తండాలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యాసంగి సీజన్‌కు సంబంధించిన రైతుబంధు డబ్బులను రైతులకు ఇవ్వవద్దంటూ కాంగ్రెస్ పార్టీ నాయకులు రేవంత్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఢిల్లీలో ఈసీకి ఫిర్యాదు చేయడం శోచనీయమన్నారు. దీంతో రైతాంగంపై కాంగ్రెస్ కపట ప్రేమ బట్టబయలైందని పేర్కొన్నారు. రైతాంగానికి నష్టం చేసే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ఎక్కడికక్కడ నిలదీయాలని రైతులకు పిలుపునిచ్చారు. రైతుబంధుపై అన్నదాతలు ఆందోళన చెందవద్దని, ఎప్పటిలాగే ప్రభుత్వం యాసంగి పంట సాయాన్ని నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం అమలు చేస్తున్న పథకాలను ఓర్వలేక కాంగ్రెస్ కుటిల బుద్ధిని ప్రదర్శిస్తున్నదని, దీనిని రైతులు గ్రహించాలని సూచించారు.



గరిడేపల్లి : కల్మల్‌చెర్వు గ్రామంలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న రైతులు



భువనగిరి కలెక్టరేట్ : నందనం గ్రామంలో కాంగ్రెస్ నేతల దిష్టిబొమ్మతో రాస్తారోకో నిర్వహిస్తున్న రైతులు, బీఆర్ఎస్ శ్రేణులు

## కాంగ్రెస్‌పై రైతన్న కన్నెర్ర

రైతుబంధు పెట్టుబడి సాయం ఆపాలని ఈసీకి ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ పార్టీపై రైతన్న కన్నెర్ర చేశాడు. కాంగ్రెస్ నాయకుల కుట్రలను ఖండిస్తూ శుక్రవారం బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి పలు చోట్ల నిరసనలు తెలిపారు. రాస్తారోకోలు నిర్వహించి ఆగ్రహం వ్యక్తం చేశారు. టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, ఉత్తమ్‌మార్‌రెడ్డి, మాణిక్‌రావు ఠాక్రే దిష్టిబొమ్మలను ఊరేగించి దహనం చేశారు. బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.



పాలకవీడు : అలింగాపురంలో రైతులతో కలిసి నిరసన ప్రదర్శన చేపడుతున్న బీఆర్ఎస్ కార్యకర్తలు



హుజూర్‌నగర్‌లో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



నేరేడుచర్లలో రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, రైతులు



మఠంపల్లి మండల కేంద్రంలో నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు